నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 22 మే 2025 | HYDERABAD

ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్ పేట, మే 21: ప్రజల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీలో 75 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీల్లో ఒక్క హామీనీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందన్నారు. రేవంత్ సర్కారు ఇచ్చిన మాట నిలబెట్టుకునేంతవరకు ప్రజల పక్షాన పోరాడుతామని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి స్పష్టం చేశారు.

• భారీ వర్షం

నగరంలో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో మధ్యాహ్నం నుంచి పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అత్యధికంగా జీహెచ్ఈఎల్‌లో 3.3 సెం.మీ, పఠాన్‌చెరులో 2.8 సెం.మీ వర్షం కురిసింది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. -సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ)

ఉగ్ర భయం వల్లే.. ఐపీఎల్ రద్దు?

సిటీలో మ్యాచ్‌ల రద్దుకు కారణమదేనా?
ముందే పసిగట్టిన నిఘా సంస్థలు
అరెస్టయిన నిందితుల సోషల్‌మీడియా నెట్‌వర్క్‌పై పోలీసుల ఆరా

సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో జరుగాల్సిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఎందుకు రద్దయ్యాయి..? విజయనగరంలో బయటపడ్డ బాంబు పేలుళ్ల కుట్రకు ఈ ఐపీఎల్ మ్యాచ్‌ల రద్దుకు ఏమైనా సంబంధాలున్నాయా? దేశ ద్రోహం కేసు ఎదుర్కొంటున్న హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసుకు ఏమైనా లింక్‌లున్నాయా? ఐపీఎల్ మ్యాచ్‌ల రద్దుపై ప్రజలలో భిన్న రకమైన చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ల బందోబస్తుకు రాచకొండ పోలీసులకు మంచిమార్కులొచ్చాయి. అలాగే హైదరాబాద్‌కు క్రికెట్ అసోసియేషన్ సైతం నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా.. హైదరాబాద్‌లో జరుగాల్సిన క్రికెట్ మ్యాచ్‌లను రద్దు చేసి, వాటిని మరో వేదికపై ఎందుకు నిర్వహిస్తున్నారని చర్చించుకుంటున్న సమయంలోనే హైదరాబాద్‌లో ఉగ్ర కుట్రకు విజయనగరం నుంచి భారీ స్కెచ్ వేశారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఉగ్ర కుట్రకు, ఐపీఎల్ మ్యాచ్‌ల రద్దుకు లింక్‌లున్నాయనే వాదన వినిస్తున్నది.

ఇంకా మూడు మ్యాచ్‌లు..

ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 10న సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కత నైట్ రైడర్స్ మ్యాచ్, 20న ఫస్ట్ క్వాలిఫైయర్ మ్యాచ్, 21న ఎలిమినేటర్ మ్యాచ్ జరుగాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో ఐపీఎల్-2025ని వారం రోజుల పాటు వాయిదా వేస్తూ ఈ నెల 9న బీసీసీఐ ప్రకటించింది. ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించగానే బీసీసీఐ మ్యాచ్‌ల నిర్వహణపై చర్చించుకొని, 17 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటే మిగిలిన ఐపీఎల్ మ్యాచ్‌ల వేదికల్లో మార్పులను కూడా వెల్లడించింది. అందులో హైదరాబాద్‌లో జరుగాల్సిన మూడు మ్యాచ్‌ల వేదికలు మారాయి. హైదరాబాద్‌లో జరుగాల్సిన మూడు మ్యాచ్‌లను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చింది..? హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌తో పాటు రాచకొండ పోలీసులు నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని బీసీసీఐకి చెప్పినట్లు తెలిసింది. అప్పటి వరకు ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఆరు క్రికెట్ మ్యాచ్‌లకు నిర్వహించిన బందోబస్తుపై రాచకొండ పోలీసులను ఐపీఎల్ నిర్వాహకులు ప్రశంసించినట్లు అధికారులు తెలిపారు. అయినా కూడా హైదరాబాద్‌లో మ్యాచ్‌లకు ఎందుకు చోటివ్వలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఉగ్రకుట్రకు స్కెచ్..

హైదరాబాద్‌లో గతంలో జరిగిన ఉగ్రవాద ఘటనల నేపథ్యం ఉండడం, ఆపరేషన్ సిందూర్ తరువాత స్లీపర్ సెల్స్, ఉగ్రసానుభూతిపరులు యాక్టివేట్ అయ్యే అవకాశాలపై నిఘా సంస్థలు హెచ్చరించిన నేపథ్యంలోనే క్రికెట్ మ్యాచ్‌ల నిర్వాహణకు హైదరాబాద్ సరైన వేదిక కాదని నిర్వాహకులుభావించారా? అనే సందేహాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో ఉగ్రకుట్రకు విజయనగరం నుంచి స్కెచ్ వేశారని వెలుగులోకి రావడంతో ఆ సందేహాలు నిజమనే వాదన విన్పిస్తోంది. నిఘా సంస్థలు ముందుగానే హెచ్చరించడంతోనే బీసీసీఐ ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణను రద్దు చేసి ఉండవచ్చని క్రికెట్ అభిమానులు పేర్కొంటున్నారు.

ఎవరెవరిని కలిశారో..

విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రహమాన్, సికింద్రాబాద్‌కు చెందిన సమీర్‌లను విజయనగరం పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సోషల్‌మీడియా వేదికగా ఒక్కటైన ఇరువురు దేశ వ్యాప్తంగా పేలుళ్లకు కుట్ర పన్నినట్లు విచారణలో బయటపడింది. బోయిగూడకు చెందిన సమీర్ లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తూ కొన్ని సామాజిక సేవ కార్యక్రమాల పేరుతో యువకులను ఆకర్షించినట్లు సమాచారం. రాత్రి వేళల్లో చాలా మంది యువకులతో గ్రూప్ మీటింగ్‌లు పెడుతూ ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తున్నాడనే విషయం విచారణలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఇద్దరు మరికొంత మందితో దేశ వ్యాప్తంగా సోషల్‌మీడియా వేదికగానెట్‌వర్క్‌ను భారీగా పెంచుకున్నారు. బాంబులు తయారు చేసి వాటిని విజయనగరం ప్రాంతంలోని అడవుల్లో ఈ నెల 21, 22వ తేదీల్లో పేల్చి రిహార్సల్స్ చేయాలనుకున్నారు. ఎక్కువ మొత్తంలో టిఫిన్ బాంబులు తయారు చేసి వాటిని హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాలలో పేల్చి బీభత్సం సృష్టించేందుకు కుట్ర చేశారనే విషయం విచారణలో తేలింది. ఇందులో ప్రధానంగా హైదరాబాద్ ప్రస్తావన రావడం, సికింద్రాబాద్‌కు చెందిన సమీర్ నిర్వహించిన గ్రూప్ మీటింగ్‌లకు చాలా మంది యువకులు హాజరైనట్లు సమాచారం రావడంతో నిఘా సంస్థలు ఆరా తీస్తున్నాయి. అయితే హైదరాబాద్‌కు ఉగ్ర ముప్పు ఉండే అవకాశాలను ముందుగానే నిఘా సంస్థలు గుర్తించి ఇక్కడ మ్యాచ్‌ల నిర్వాహణను రద్దు చేసుకోవాలని సూచనలు చేసినట్లు తెలుస్తోంది. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, మరికొంత మంది పాకిస్తాన్‌కు సహకరిస్తుండడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో యూట్యూబర్ జ్యోతి హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వీడియోలు తీసింది.. ఆమె కూడా అరెస్ట్ కావడం గమనార్హం.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

సీపీ సీవీ ఆనంద్

మెహిదీపట్నం : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు ఎల్లప్పుడూ సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. సులభతరమైన పోలీసింగ్ అందించడంలో భాగంగా నగరంలో 72వ పోలీస్ స్టేషన్‌గా టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశామని, ఇక్కడ పోలీసుల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్, అదనపు ఇక్బాల్ సిద్ధికి, టోలిచౌకి ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయక్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం నగరంలో పోలీసింగ్‌ను పటిష్టం చేయడంలో భాగంగా జోన్లను విభజించామని, అదే విధంగా ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులోభాగంగానే టోలిచౌకి పోలీస్‌స్టేషన్ కొత్తగా ప్రారంభించామన్నారు. ఫిలింనగర్, మెహదీపట్నం, గోల్కొండ పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో నుంచి కొన్ని ప్రాంతాలను టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి తెచ్చామన్నారుఏ. ఈ సందర్భంగా మొదటి ఎఫ్ఐఆర్‌ను కమిషనర్ సీవీ ఆనంద్ నమోదు చేశారు.

టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

ఇంటి వద్దకే ఎఫ్ఐఆర్

ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ అందిస్తున్న పోలీసులు
వెస్ట్‌జోన్‌లో పటిష్టంగా అమలు

బంజారాహిల్స్, మే 21: న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ కాపీ కోసం అనేకసార్లు చక్కర్లు కొట్టాల్సిన అవసరం లేకుండా చూసేందుకు ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ అందించేలా చూడాలని వెస్ట్‌జోన్ డీసీపీ ఆదేశించారు. దీంతో ఇటీవల బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీసులు వారంరోజులుగా నమోదైన ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఎప్పటికప్పుడు ఇంటికి వెళ్లి అందజేస్తున్నారు. బీఎన్ఎస్ఎస్ ప్రకారం ఫిర్యాదు చేసిన వెంటనే కాగ్నిజబుల్ నేరం అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, కాపీని అతడికి అందజేయడం తప్పనిసరి చేసింది. అయితే పని ఒత్తిడితో చాలావరకు ఆచరణలో సాధ్యం కావడం లేదు. అయితే ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులకు పోలీసు వ్యవస్థపై మరింత విశ్వాసం పెంచేలా చూడడం అందరి బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా నిబంధనల మేరకు నేరుగా ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ కాపీ అందించడంతో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు. డీసీపీ ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ పరిధిలో నమోదవుతున్న అన్ని కేసులకు చెందిన ఎఫ్ఐఆర్‌లను నేరుగా ఇంటికి ఇవ్వడం కానీ, వేరే ప్రాంతంలో ఫిర్యాదుదారుడు నివాసం ఉంటే వాట్సాప్ ద్వారా ఎఫ్ఐఆర్ పంపిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో పాటు తీవ్రమైన నేరాలలో బాధితులు ఫిర్యాదులు ఇచ్చిన తర్వాత మళ్లీ పీఎస్‌కు రావడం ఇబ్బందికరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఎఫ్ఐఆర్‌లు ఇంటికి పంపిస్తున్నామని ఫిలింనగర్ ఎస్‌హెచ్‌వో సంతోషం తెలిపారు. సున్నితమైన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు మఫ్టీలో వెళ్లి అందజేస్తామని వివరించారు. దీనివల్ల ఫిర్యాదుదారులకు ఊరట కలగడంతో పాటు వేగంగా దర్యాప్తు ప్రక్రియను చేపట్టే అవకాశం సైతం ఉందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

ఫిలింనగర్ పీఎస్ పరిధిలో ఫిర్యాదుదారుడికి ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ అందజేస్తున్న పోలీసులు

విద్యుత్ వినియోగంలో నిబంధనలివి

సీఈఐజీ మార్గదర్శకాలు

సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): గుల్జార్‌హౌస్ వద్ద అగ్నిప్రమాదం ఘటన నేపథ్యంలో విద్యుత్ భద్రతానిబంధనలను కఠినంగా పాటించాలంటూ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ ప్రజలకు సూచించింది. హాస్పిటల్స్, మల్టీస్టోర్డ్ బిల్డింగ్స్, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్సులు, సినిమా హాళ్లు, హోటల్స్, ఇతర ప్రజా సౌకర్యాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది. విద్యుత్ సురక్షిత వినియోగం కోసం విద్యుత్ చట్టం 2003, నియమనిబంధనలు, అదనపు మార్గదర్శకాలను అనుసరించాలని తెలిపింది. ఆయా సంస్థల నిర్వాహకులు ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు ఇచ్చిన సూచనలను కచ్చితంగా పాటించాలని లేనట్లయితే విద్యుత్ చట్టం 2003 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

సీఈఐజీ (చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్) మార్గదర్శకాలివే..!

- లైటింగ్ సర్క్యూట్‌లకు 30ఎంఏ ఈఎల్‌సీబీ/ఆర్‌సీసీబీ, పవర్‌సర్క్యూట్‌లకు 100 ఎంఏ ఈఎల్‌సీబీ అమర్చాలి.
- విద్యుత్ వైరింగ్, ఇన్‌స్టాలేషన్లు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్ 2023, నేషనల్ ఎలక్ట్రికల్ కోడ్ ఆఫ్ ఇండియా 2023, నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2016, మిగతా ఐఎస్, ఐఈసీ ప్రమాణాలకు లోబడి ఉండాలి.
- విద్యుత్ వినియోగానికి తగినట్లు సరైన సామర్థ్యం కలిగిన కేబుల్స్ అంటే లైటింగ్‌కు 1.5 స్క్వేర్ మిల్లీమీటర్, పవర్‌పాయింట్లకు 2.5 స్క్వేర్ మిల్లీమీటర్లు, ఏసీ యూనిట్లకు 4స్క్వేర్ మిల్లీమీటర్లు .. ఇలా వినియోగాన్ని బట్టి లోడ్‌కు తగ్గట్లుగా కేబుల్స్ వాడాలి. దీనివల్ల అధికంగా వేడి కావడం, ఎలక్ట్రికల్ వైఫల్యాలను నివారించవచ్చు.
- ఎలక్ట్రికల్ వర్క్ లైసెన్స్‌డ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్, అనుమతి కలిగినవారితో, నైపుణ్యం కలిగిన వైర్‌మెన్ల ద్వారా చేయించాలి.
- వోల్టేజీ హెచ్చుతగ్గులున్న ప్రాంతాల్లో స్టెబిలైజర్లను ఉపయోగించాలి.

టాయిలెట్ల నిర్వహణ ఇంత అధ్వానమా?

- నిర్వహణపై స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాల విస్మయం
- క్లీనింగ్ పేరుతో నెలనెలా కోట్ల బిల్లులు
- అయినా శుభ్రంగా లేవని పరిశీలనలో వెల్లడి
- అధికారుల గణాంకాల్లో చూపిస్తున్నవి 2199
- ప్రస్తుతం పనిచేస్తున్నవి 828
- ఉన్నవాటినీ శుభ్రం చేయడం లేదని నగరవాసుల మండిపాటు

సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో వందకు వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా సాధించాలనే లక్ష్యానికి అధికారులు నీళ్లొదిలారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎస్ ఫ్లస్ ఫ్లస్) నగరంగా హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగా..ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై సర్వేపై కేంద్ర బృందం పర్యటన చేస్తున్నది. వచ్చే నెలలో ర్యాంకుల జాబితాను కేంద్రం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై ఈ బృందం అసంతృప్తి వ్యక్తం చేయడం, ఆరు జోన్లలో మొత్తం 2,199 టాయిలెట్లలో 828 వినియోగంలో ఉండగా, 1,371 చోట్ల వృథా ఉండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

టాయిలెట్ల నిర్వహణపై ఆరా

కేంద్రం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు వచ్చి నగరంలోని టాయిలెట్లను పరిశీలించింది. అయితే అధికారులు మాత్రం వారిని తప్పుదోవ పట్టించి నీట్‌గా ఉన్న టాయిలెట్ల దగ్గరకు తీసుకువెళ్లి చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. 10 రోజుల స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాగంగా నగరానికి వచ్చిన కేంద్ర బృందం టాయిలెట్ల శుభ్రత, వినియోగం, నిర్మాణ క్వాలిటీ చెక్ చేస్తున్నది. వీటితో పాటు గ్రేటర్‌లో పలు చోట్ల లూ కేఫ్‌లకు తాళాలు వేస్తూ దర్శనమిస్తున్నాయి. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ వోటీ) పద్ధతిన నగరంలో 60 లూ కేఫ్‌లను 2018 జూలైలో జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చింది. తొలిదశలో ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్లలో ఈ కేఫ్‌లను ప్రారంభించింది. సిటీవాసుల టాయిలెట్ల సమస్య తీర్చడంతో పాటు నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడమే దీని లక్ష్యం. వీటిని 15 ఏండ్ల ఒప్పందం కింద మెస్సర్స్, ఇక్సోరా ఏజెన్సీలకు అప్పగించారు. లూ కేఫ్‌లో భాగంగా ముందు భాగంలో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ షాపు వెనకే అనుకొని లగ్జరీ స్మార్ట్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటిని సదరు వ్యాపారులు ఇచ్చిన అద్దెతో ఏజెన్సీలు మెయింటనెన్స్ చేయాలి. చాలా చోట్ల నిర్వహణ సరిగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

'అర్జెంట్' అయితే కష్టమే

టాయిలెట్ల క్షేత్రస్థాయిలో లేకున్నా వాటి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నట్లు, ఇందులో కొన్ని ఎజెన్సీలతో అధికారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లలో సగానికి పైగా వినియోగంలో లేవని, కొన్ని చోట్ల గాయబ్ అయ్యాయని, బిల్లులు చెల్లింపులు మాత్రం యథావిధిగా జరుపుతుండడం పట్ల ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల నల్లాలు, డోర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవడంతో నిరుపయోగం మారాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే వారికి 'అర్జెంట్' అయితే ఎక్కడికి వెళ్లాలో అర్థం కానీ పరిస్థితి నెలకొనడం విచారకరం.

గ్రేటర్‌లో టాయిలెట్ల నిర్వహణ లెక్కలు ఇవే..

జోన్	టాయిలెట్ల సంఖ్య	రన్నింగ్‌లో ఉన్నవి	అందుబాటులో లేనివి
ఎల్బీనగర్	492	326	166
చార్మినార్	342	119	223
ఖైరతాబాద్	293	179	114
శేరిలింగంపల్లి	438	94	344
కూకట్‌పల్లి	422	28	394
సికింద్రాబాద్	212	82	130

మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

నామినేటెడ్ పోస్టులు బీసీలకు ఇవ్వరా?

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, మే 21: రాష్ట్ర జనాభాలో 56% బీసీలు ఉన్నప్పటికీ నామినేటెడ్ పోస్టుల్లో బీసీలను విస్మరించడం విడ్డూరంగా ఉన్నదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బుధవారం కాచిగూడలో ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో గుజ్జ సత్యం మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టులన్నీ అగ్రవర్ణాలకే కట్టబెట్టారని, సమాచార కమిషనర్ నియామకాల్లో ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మొత్తం సమాచార కమిషనర్ పదవుల్లో ఇప్పటికీ 7 పదవులు భర్తీ చేయగా.. అందులో ఒక్క బీసీకీ అవకాశం ఇవ్వకపోవడం బీసీలను అవమానించడమేనన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన ద్వారా బీసీలకు న్యాయం చేస్తామని గొప్పలు చెప్పి హామీ ఇచ్చారని, ఆ హామీలు ఇప్పటికీ అమలు కావడం కాకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సొతిండియా ఇన్‌చార్జి సూర్య నారాయణ, జానయ్య, నరేందర్, భద్ర, తదితరులు పాల్గొన్నారు.

అతివేగం.. అజాగ్రత్త

కారు.. డీసీఎం ఢీ.. ముగ్గురు యువకుల దుర్మరణం

హయత్‌నగర్/పెద్ద అంబర్‌పేట మే 21 : కుంట్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. కుంట్లూరుకు చెందిన పిన్నింటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రీనాథ్‌రెడ్డి (24), చుంచు వర్షిత్‌రెడ్డి (23), ఎలిమేటి పవన్‌కళ్యాణ్ రెడ్డి (24) కలిసి కారులో పసుమాముల నుంచి కుంట్లూరుకు బయలుదేరారు. అదే సమయంలో కుంట్లూరు నుంచి పసుమాముల వైపు డీసీఎం బయలుదేరింది. మార్గమధ్యలో కుంట్లూరులోని నారాయణ కళాశాల-బాసర క్యాంపస్ ఎదురుగా మూలమలుపు వద్ద అతివేగం, అజాగ్రత్తగా ఎదురెదురుగా వచ్చిన డీసీఎం, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న పిన్నింటి చంద్రసేనారెడ్డి, చుంచు త్రీనాథ్‌రెడ్డి, చుంచు వర్షిత్‌రెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ ఎలిమిటి పవన్ కళ్యాణ్‌రెడ్డిని చికిత్స కోసం పోలీసులు వైద్యశాలకు తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను పోలీసులు, స్థానికుల సహాయంతో ఇనుప రాడ్లతో వెలికి తీసి.. పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతులంతా కుంట్లూరు గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మూలమలుపు వద్ద అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ కారణంగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు చెబుతున్నారు. కాగా, ఘటనాస్థలాన్ని ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి స్థానికులు వారికి వివరించారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను అక్కడ నుంచి తరలించారు.

కుంట్లూరులో కారు, డీసీఎం ఢీకొన్న దృశ్యం